క్లుప్తంగా

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ తెలంగాణాలో శనివారం రూ. 11,360 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నాయకుల అబద్ధపు ప్రచారాలను ప్రజలెవరూ నమ్మబోరన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్, రాష్ట్ర నాయకుడు ఆడెపు రవీందర్, కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్, నాయకులు శిరస్వాల్ కైలాష్, నరేశ్, మ్యాన రాంప్రసాద్, బర్కం నవీన్‌యాదవ్, మల్లడపేట భాస్కర్ పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బోయినపల్లి: ఇల్లు లేని అర్హులైన పేదలను ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మండల సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో ఆదివారం ఇళ్లులేని పేదలతో మాట్లాడి వారి బాధలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం చేసిన వాగ్దానం ఏళ్లు గడిచినా అమలు కావడం లేదని ఆరోపించారు. మండలంలో డబుల్ ఇళ్ల నిర్మాణం ఊసే లేదని తెలిపారు. వెంటనే అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, మహిళలు వావిలాల బుజ్జవ్వ, కనుకవ్వ, లక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ముస్తాబాద్: ఊరురా ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టి పార్టీ బలోపేతం చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మీసం లక్ష్మణ్ అన్నారు. ముస్తాబాద్‌లో సీపీఐ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ఈనెల 22న ముస్తాబాద్‌లో కళాజాత, బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ మండల కార్యదర్శి మిద్దె నర్సయ్య, కిషన్, భూదయ్య, నర్సింలు, రామచంద్రం, ఆనంద్, శంకర్ పాల్గొన్నారు.

ఇల్లే గ్రంథాలయం..

- విలువైన పుస్తకాలతో వెలుగొందుతున్న గ్రంథాలయం
- పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు వరం
- అందరికీ ఆదర్శం రిటైర్డ్ టీచర్



గ్రంథాలయంలో పుస్తకాలు



ఇదే పౌర గ్రంథాలయం

వేములవాడఅర్బన్: ఒక రిటైర్డ్ ఉపాధ్యాయుడు తన ఇంటినే గ్రంథాలయంగా మార్చాడు. తాను సేకరించిన గ్రంథాలు, పుస్తకాలు పదిమంది చదివి విజ్ఞానవంతులు కావాలనే ఆలోచన గ్రంథాలయం ఏర్పాటుకు పునాదివేసింది. ఎక్కడో పుట్టి, మరెక్కడో పెరిగి ఉద్యోగ రీత్యా వేములవాడకు వచ్చి స్థిరపడ్డ ఆయన పేరు వీరగోని ఆంజనేయులుగౌడ్. ఒక ఉపాధ్యాయుడిగా ఎంతోమంది జీవితాలను తీర్చిదిద్దిన ఆయన ఉద్యోగ విరమణ అనంతరం సైతం విజ్ఞానాన్ని పంచుతున్నారు.

వేములవాడ పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన వీరగోని ఆంజనేయులుగౌడ్ ఉదయం నిద్ర లేచిన ప్పటి నుంచి రాత్రి నిద్రించే వరకు పుస్తకాల మధ్యే సంచరిస్తూ, గ్రంథాలయానికి వచ్చే వారందరికీ అవసరమైన పుస్తకాలను అందించడంతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు మార్గనిర్దేశనం చేస్తూ గడపడం ఆయన దినచర్య.

అందుబాటులో అన్ని పుస్తకాలు

స్థానిక శ్రీరాజరాజేశ్వర సంస్కృత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేసి 2009లో ఉద్యోగ విరమణ పొందిన ఆంజనేయులుగౌడ్‌కు చిన్ననాటి నుంచి పుస్తకాల సేకరణ అంటే ఎంతో ఇష్టం ఉండేది. అప్పటి నుంచి నిరంతర గ్రంథ సేకరణ ఆగలేదు. ఎక్కడ ఏ పుస్తకం కనిపించినా తన గ్రంథాలయంలో ఉండాలని ఆకాంక్షించాడు. అలాగే తాను సేకరించిన పుస్తకాలు తన కోసమే కాకుండా పరుల కోసం ఉపయోగపడాలని అనుకున్నాడు. తాను సేకరించిన వివిధ రకాల గ్రంథాలతో తన నివాసంలోనే తల్లిదండ్రులు వీరగోని హనుమమ్మ-బసవయ్య పేరుతో పౌర గ్రంథాలయం ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో తెలుగు హిందీ, ఇంగ్లిష్, సంస్కృత భాషలకు చెందిన సుమారు లక్షకు పైగా పుస్తకాలున్నాయి. వాటిలో ప్రముఖుల జీవిత చరిత్రలు, కవితలు, పద్యాలు, నాటకాలకు సంబంధించినవే కాకుండా, పాఠ్య పుస్తకాలు కూడా ఉన్నాయి. అలాగే నాలుగు వేదాలు, భారత, భాగవత, రామాయణం, భగవద్గీతతో పాటుగా ఖురాన్, బైబిల్, జైన్, సిక్కు మత గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. వివిధ భాషలకు చెందిన దిన, వార, మాస పత్రికలు చదువుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. ఈ గ్రంథ రాజాన్ని అమర్చేందుకు తన నివాసంలో గదులు సరిపోకపోవడంతో ఇంటిపైన రెండు గదులు ప్రత్యేకంగా వీటి కోసం ఏర్పాటు చేశారు. గ్రంథాలయానికి వచ్చే వారు చదువుకునేందుకు వీలుగా ఆ గదుల ముందు రేకులు షెడ్డు వేయించి, టేబుళ్లు, ఫ్యాన్‌లు తాగునీటి సౌకర్యం కల్పించారు. 30 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ గ్రంథాలయానికి నెలకు రూ.10 వేల వరకు ఖర్చు వస్తున్నట్లు ఆయన తెలిపారు.



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత

ఉదయం నుంచి అక్కడే..

ఈ గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పుస్తక అధ్యయనంలో గడుపుతారు. సుమారు 30 మంది వరకు పోటీ పరీక్షలకు హాజరయ్యే వారు వస్తుంటారని ఆయన తెలిపారు. వీరిలో ఉదయం టిఫిన్ బాక్స్‌తో వచ్చి పొద్దుపోయే వరకు గ్రంథాలయంలో చదువుకునే వారున్నారు.

సేవకు సత్కారం

ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఆంజనేయులుగౌడ్‌ను పలు సందర్భాల్లో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో పాతూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గ్రంథాలయ ఉద్యమకారుడు' అనే బిరుదు అందించి సన్మానించారు. అలాగే హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. వేములవాడలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో నంది అవార్డు అందుకోవడం విశేషం.

ప్రతిరోజూ వస్తా



నేను ప్రతిరోజూ 9 గంటలకు గ్రంథాలయానికి వస్తా. నేను జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించేందుకు ప్రిపేర్ అవుతున్నా. దాంతో ప్రతిరోజు టిఫిన్ తీసుకుని వచ్చి మధ్యాహ్నం ఇక్కడే భోజనం చేసి, రాత్రి వరకు ఇక్కడ పుస్తక అధ్యయనం చేసి వెళ్తున్నా. ఇక్కడ అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

– దామోదర్, చెక్కపల్లి

గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్న



నేను గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. గ్రంథాలయంలో ఆంజనేయులు సార్ అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ప్రతిరోజూ వచ్చి ఇక్కడే చదువుకుంటున్నా. కేవలం పుస్తకాలు చదువడమే కాకుండా సర్ సలహాలు, సూచనలు కూడా ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– సంతోష్‌కుమార్. వేములవాడ

పది మంది చదవాలన్నదే నా తపన



నేను చిన్ననాటి నుంచి ఎన్నో పుస్తకాలు సేకరించాను. వాటిని పది మంది చదవాలనే తపనతోనే మా ఇంటిపై మా తల్లిదండ్రుల పేరుతో పౌర గ్రంథాలయం ఏర్పాటు చేశా. ఉద్యోగాలకు సిద్ధమయ్యే వారు ప్రతిరోజూ వస్తుంటారు. అలాగే వారికి అన్ని వసతులు కల్పించా. లక్షకు పైగా పుస్తకాలను అందుబాటులో ఉన్నాయి. ఎందరో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు గ్రంథాలయం వచ్చి చదువుకుంటున్నారు.

– వీరగోని ఆంజనేయులుగౌడ్. రిటైర్డ్ ఉపాధ్యాయుడు. వేములవాడ

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సభ్యులు

కోనరావుపేట: మండలం బావుసాయిపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. బావుసాయిపేటలో శనివారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం గద్దెపై పలువురు మద్యం సేవించారు. దళిత నాయకులు అభ్యంతరం తెలుపుతూ ఆందోళనకు పిలుపునిచ్చారు. దీంతో కురుమ సభ్యులు ముందుకు వచ్చి శనివారం రాత్రి జరిగిన సంఘటనకు చింతిస్తున్నామని, విగ్రహానికి క్షీరాభిషేకం చేసి తమ తప్పును మన్నించాలని కోరారు.

చిన్నలింగాపూర్‌లో బలగం సినిమా ప్రదర్శన



బలగం సినిమా వీక్షిస్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామంలో ఎంపీటీసీ బైరినేని రాము ఆధ్వర్యంలో శనివారం రాత్రి గ్రామపంచాయతీ వద్ద బలగం సినిమా ప్రదర్శించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై సినిమాను వీక్షించారు. చిన్నా, పెద్దా, ఆడా, మగా అని తేడా లేకుండా సినిమా చూస్తూ కన్నీరు మున్నీరయ్యారు. బంధాలను కలిపేలా, బంధాల విలువలు తెలిసేలా సినిమా తీశారంటూ వృద్ధులు బలగం సినిమా టీమ్‌ను అభినందించారు.

సైకాలజిస్టుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న పున్నంచందర్

సిరిసిల్లటౌన్: సైకాలజిస్టుల సంక్షేమానికి తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ నిరంతరం పాటుపడుతుందని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నంచందర్ అన్నారు. ఆదివారం సిరిసిల్లలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ప్రాక్టీస్ చేస్తున్న సైకాలజిస్టులు అసోసియేషన్‌లో సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెలాఖరు వరకు గోపాల్‌నగర్‌లోని సంజన క్లినిక్‌లో వివరాలు అందించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 93461 26222, 96666 61254, 96666 61254లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆడెపు వేణు, ఉపాధ్యక్షులు వై.ఆంజనేయులు, ఎస్. నాగజ్యోతి, ప్రధాన కార్యదర్శి అలువాల ఈశ్వర్, మీడియా సెక్రటరీ రాము పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: మున్సిపల్ పరిధిలోని 30వ వార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్, లివర్, పేగు సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఉచిత పరీక్షలతో పాటు మందులు అందించారు. సుమారు వందకు పైగా రోగులు సేవలను వినియోగించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, వైద్యులు డాక్టర్ దిలీప్‌రెడ్డి, శ్రీలక్ష్మిరెడ్డి, బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు చొటు జలంధర్, కొండ ఎల్లయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి సభకు తరలిన కమ్యూనిస్టులు



ఉమ్మడి సభకు తరలుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి: హైదరాబాద్‌లో జరిగే మహాసభలకు ఇరు కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఎగ్జిబిషన్ గ్రౌండులో జరుగుతున్న సీపీఎం, సీపీఐ ఉమ్మడి బహిరంగ సభకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి వందల సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీల నాయకులు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికే ఈ సభ జరుగుతోందని వారు అన్నారు. కార్మిక, కర్షక, రైతు కూలీల అభివృద్ధే ధ్యేయంగా కమ్యూనిస్టు పార్టీలు పనిచేస్తాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మూశం రమేష్, మండల కార్యదర్శి మంచికట్ల రమేష్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు, సీపీఐ నాయకులు మంత్రి చంద్రన్న, సర్మెట దేవరాజు, రాదాసు శ్రీనివాస్, కడారి రాములు, పంతం రవి, అన్నల్‌దాస్ గణేశ్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వడగండ్ల వానతో సగం పంట కూడా చేతికొచ్చే పరిస్థితి లేదన్నారు. కొంతమంది రైతులు నిరాశ చెంది తమ వరి చేలను పశువులు మేసేందుకు వదిలివేయడం జరుగుతుందన్నారు. ఎప్పుడూ లేనంతగా ఈసారి వరి పంటలకు క్రిమిసంహారక మందులను వాడడం జరిగిందన్నారు. కొంతమంది కౌలు రైతులు కౌలును చెల్లించేందుకు కూడా పంటకు డబ్బులు వచ్చే అవకాశం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజునాయక్, లింగంగౌడ్, బుచ్చాగౌడ్, రాములు, రాంరెడ్డి పాల్గొన్నారు.

696 రోజులుగా అన్నదానం

వేములవాడ: ఆకలితో అలమటిస్తున్న పేదలకు తానున్నామంటూ మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు ఆదివారం వంద మందికి అన్నదానం నిర్వహించారు. 696 రోజులుగా వేములవాడ రాజన్న గుడి ప్రాంతాల్లో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు మధు మహేశ్, పొలాస రాజేందర్, నటరాజ్, చల్లా సత్తయ్య తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్లలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్యయాదవ్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ చెన్నమనేని శ్రీకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము స్వప్న, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఉపసర్పంచ్ పుంగంగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ గుండా వెంకటేశ్, క్రీడా నిర్వాహకులు గొల్లపల్లి సాయి, ధీటి శేషు, గండి నరేశ్, జెట్టి వేణు, వద్నాల శ్రీజన్, షరీఫ్ పాల్గొన్నారు.

కళలకు పూర్వ వైభవం తీసుకొద్దాం

వీర్నపల్లి: కళలకు పూర్వ వైభవం తీసుకొద్దామని జిల్లా సాంస్కృతిక సమాఖ్య కళాకారుల అధ్యక్షుడు ఎల్లం పోశెట్టి అన్నారు. స్థానిక ఎల్లమ్మ గుడి అవరణలో మండల అధ్యక్షుడు నేరెళ్ల ముత్యంగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై ఆయన మాట్లాడారు. అంతరించిపోతున్న కళలను కాపాడేందుకు అందరూ సహకరించాలన్నారు. వీర్నపల్లి మండలంలో చాలామంది కళాకారులు ఉన్నారని, వారిని ప్రోత్సహించేందుకు సాంస్కృతిక సమాఖ్య సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, వివిధ కళాకారులు, మహిళలు పాల్గొన్నారు.

హాస్టల్‌లో తొలగిన నీటి సమస్య

కోనరావుపేట: మండలం ధర్మారంలో ఎస్సీ వసతి గృహంలో బోరుకు మోటారును ఆదివారం ప్రారంభించారు. హాస్టల్‌లో నీటికి ఇబ్బందులు సర్పంచ్ గున్నాల అరుణ తమ నీటి సమస్య తీరినట్లు అయిందని విద్యార్థులు, వార్డెన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తీగల వెంకన్న, బత్తుల రేఖ, గ్రామస్తులు కొమ్ము ఎల్లయ్య, వెలిశాల తిరుపతి, పొట్లపల్లి గోపాల్‌రావు, కార్యదర్శి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వీర్నపల్లి: మండలంలోని సీతారాంనాయక్ తండా గ్రామంలో ఆదివారం భూక్య బాలునాయక్‌కు రూ.55 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును సర్పంచ్ బానోత్ రవి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సేవ్యా నాయక్, జనార్దన్, తిరుపతి, లింగం పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలి పెంచాలి

ఇల్లంతకుంట: ఉపాధిహామీ కూలి రూ.600కు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నారం నర్సయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల కారణంగా కూలి పని చేసుకుని జీవనం సాగించే ప్రజలకు చాలీచాలని కూలి సరిపోవడం లేదన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బత్తిని స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలంలో 33 గ్రామాలు, 15 అనుబంధ గ్రామాలు ఉండి జిల్లాలోనే పెద్ద మండలమని, ఇక్కడ ఇంటర్‌మీడియట్ వరకే ఉండటంతో డిగ్రీ చదివేందుకు విద్యార్థులు సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్ వంటి పట్టణాలకు వెళ్తున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఇల్లంతకుంటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోనరావుపేట: మండలంలోని భుక్యారెడ్డితండాకు చెందిన భుక్యా కిషోర్ కుటుంబానికి జీహెచ్ఎస్ ఎస్సెస్సీ వేములవాడ ఆధ్వర్యంలో రూ.6 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో కిషోర్ మృతి చెందాడు. సభ్యులు లకావత్ దేవేందర్, బడుగు అరుణ్ అందజేశారు.

దుబ్బాక రమేశ్‌కు సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, బీసీ సంక్షేమ సంఘం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేశ్‌ను ఆదివారం గజమాలతో సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించబోయే మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలకు రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా రమేశ్‌ను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్

చందుర్తి: మండల కేంద్రంలోని ముస్లింలకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ విందులో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గొట్టే ప్రభాకర్, పులి సత్తయ్య, చంద్రం, వెంకన్న పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

- 40 ఏళ్లకు కలుసుకున్న విద్యార్థులు
- సిరిసిల్ల పద్మనాయక హాల్ వేదిక
- గురువులకు సన్మానాలు



1982-84 బ్యాచ్‌కు చెందిన సిరిసిల్ల జూనియర్ కళాశాల విద్యార్థులు, గురువులు

సిరిసిల్లటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1982–84లో ఇంటర్ చదివిన విద్యార్థులు సరిగ్గా నలభై ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని కాలేజీ రోజుల్లోని మధుర స్మృతులను నెమరేసుకున్నారు. సిరిసిల్ల పద్మనాయక ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అప్పుడు తమకు చదువు చెప్పిన అధ్యాపకులకు శాలువాలతో సన్మానించి, ఆశీర్వాదాలు పొందారు. కుటుంబ సమేతంగా హాజరైన పూర్వ విద్యార్థులు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసి, మధ్యాహ్నం భోజనాలనంతరం ఆటపాటలతో హోరెత్తించారు.

ప్రత్యేక ఆకర్షణగా జగిత్యాల అడిషనల్ కలెక్టర్

కార్యక్రమానికి జగిత్యాల అడిషనల్ కలెక్టర్ మంద మకరంద్ తల్లిదండ్రులతో ఫంక్షన్‌కు హాజరయ్యారు. తల్లిదండ్రుల స్నేహితులతో ఆయన సరదాగా గడపడమే కాకుండా తనదైన శైలిలో ఉపన్యసించి ఆకట్టుకున్నారు. ఇంటర్ అన్ని గ్రూపులకు చెందిన ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు 200 మంది హాజరయ్యారు. కార్యక్రమానికి చీటి ఉమేశ్‌రావు, సంగీతం శ్రీనివాస్, రుద్ర రఘు, సూర్యప్రకాష్, రాచర్ల వెంకన్న, ఆడెపు మురళి, చీకోటి అనీల్‌కుమార్, కటుకం ప్రశాంతి, దొంతుల భాగ్యలక్ష్మి, సీహెచ్ గీతాంజలి, రుద్ర రమ, శ్రీపేరం బుదూరు రేణుక, పద్మ పాల్గొన్నారు.

2003 ఎస్సెస్సీ విద్యార్థుల సమ్మేళనం

స్థానిక లహరి గ్రాండ్ ఫంక్షన్ హాలులో వివేకవర్ధిని హైస్కూల్‌లో 2003లో ఎస్సెస్సీ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటి స్నేహితులతో ఆడిపాడి గురువులతో పాటు అప్పటి పాఠశాల కరస్పాండెంట్ గోగూరి నాగేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఆకుల శ్రీనివాస్, తోట రాజేందర్ తదితరులను సన్మానించారు.

20 ఏళ్ల తరువాత..



సిరిసిల్లఅర్బన్: ఉపాధ్యాయులతో విద్యార్థులు

సిరిసిల్లఅర్బన్/ఇల్లంతకుంట: పట్టణంలోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 20 ఏళ్ల తరువాత ఒకే వేదికపై కలుసుకొని పూర్వ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు గోగూరి నరేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, రాజేందర్, రేఖ, రాజశేఖర్‌ను సన్మానించారు. విద్యార్థులు గోలి వెంకటేశ్, గడ్డం మోహన్, అనిల్, శ్రీకాంత్, సుమన్, నరేశ్, ప్రశాంత్, శ్రీనివాస్, సందీప్ పాల్గొన్నారు.

కందికట్కూర్‌లో

ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ జెడ్పీహెచ్ఎస్ 2001–2002 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ఒక్కటయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యా, బుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు.